ప్రజాశక్తి

మంగళవారం 21 ఫిబ్రవరి 2023 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

మళ్లీ విలీనం..!

❁10 మందికన్నా తక్కువ ఉండే స్కూళ్లే లక్ష్యం

❁ఉమ్మడి కృష్ణాజిల్లాలో 161 పాఠశాలల గుర్తింపు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ప్రభుత్వం అమల్లోకి తీసుకువస్తున్న నూతన జాతీయ విద్యావిధానం ప్రాథమిక విద్యను విద్యార్థులకు మరింత దూరం చేసే విధంగా ఉంది. ఈవిద్యా సంవత్సరంలో మూడు, నాలుగు, ఐదు తరగతుల విలీన ప్రక్రియను పూర్తి చేసిన ప్రభుత్వం...వచ్చే విద్యా సంవత్సరానికి పదిలోపు విద్యార్థులున్న పాఠశాలలను సమీపంలోని కిలోమీటరు దూరంలోపు ఉన్న పాఠశాలల్లో విలీనం చేసేందుకు పూనుకుంటోంది. దీనిలో భాగంగానే జిల్లాలో 10 లోపు విద్యార్థులున్న పాఠశాలల నివేదిక ఇప్పటికే ప్రభుత్వానికి చేరింది. దీంతో విలీనం చేయాల్సిన పాఠశాలల వివరాల తెలియజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించింది. ఈనేపథ్యంలోనే ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ విద్య పేదలకు మరింతదూరం అవుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణాజిల్లాలో మొత్తం 978 ప్రాథమిక పాఠశాలలకుగాను 122 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 10 మందికన్నా తక్కువగా ఉన్నట్లు ప్రభుత్వం చెబుతోంది. సమీపంలో కిలోమీటరులోపు ఉన్న పాఠశాలల్లో వీటిని విలీనం చేయడానికి నివేదిక కోరింది. జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఎన్‌టిఆర్ జిల్లాలో మొత్తం 600 ప్రాథమిక పాఠశాలలకు గాను 10 మంది సంఖ్యకన్నా తక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలు 39 ఉన్నాయి. విలీన ప్రక్రియ పూర్తయితే వచ్చే విద్యా సంవత్సరంలో రెండు జిల్లాల్లోని 161 ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితి నెలకొంది. రాబోయే విద్యా సంవత్సరంలో ఈ ప్రతిపాదన ఆచరణలోకి వచ్చే అవకాశం ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. గతంలో ఈఅంశంపైన విద్యార్థుల తల్లిదండ్రులు పలు ప్రాంతాల్లో ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం చాపకింద నీరులా మళ్లీ పాఠశాలల విలీనానికి పూనుకుంటోంది.

గతంలో ఇలా....

గత విద్యా సంవత్సరం ఉన్నత పాఠశాలలకు 250 మీటర్ల దూరంలో గల 195 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను విలీనం చేశారు. ఈ విద్యా సంవత్సరంలో కిలోమీటర్ దూరంలో ఉన్న 371 ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలల్లో కలిపేశారు. విలీన గందరగోళంతో నాణ్యమైన విద్య లభించదనే ఆందోళన చెందుతూ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రయివేటు స్కూళ్లకు పంపుతున్నారు. ఈ ఏడాది ప్రయివేటు పాఠశాలల్లో వేలాది అడ్మిషన్లు పెరగడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.





దగ్ధమవుతున్న కారు; ధ్వంసమైన కారు, ఫర్నీచర్, టిడిపి కార్యకర్తల నిరసన దృశ్యాలు

గన్నవరంలో భయం...భయం...

కొనసాగుతున్న ఉద్రిక్తత

టిడిపి నేతలను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - గన్నవరం, విజయవాడ అర్బన్, కలెక్టరేట్ (కృష్ణా), అవనిగడ్డ : టిడిపి కార్యాలయంపై ఎంఎల్ఎ వంశీ అనుచరుల దాడి చేపథ్యంలో గన్నవరం తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు గన్నవరంలో అదనపు పోలీసు బలగాలను దించారు. వంశీ అనుచరుల దాడిని ఖండిస్తూ కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల నుండి కొంత మంది టిడిపి నేతలు గన్నవరం వెళుతుండగా, పోలీసులు అడ్డగించారు. గన్నవరంలోని టిడిపి కార్యాలయంపై సోమవారం ఎంఎల్ఎ వంశీ అనుచరులు దాడి చేయడం ఉద్రికత్తకు కారణమైంది. కార్యాలయ ప్రాంగణంలోని వాహనానికి నిప్పు పెట్టారు. మరో రెండు వాహనాలను, కార్యాలయంలోని ఫర్నీచర్, కంప్యూటర్,

(మిగతా 6లో)

నాకు సంబంధంలేదు : ఎంఎల్ఎ వంశీ



దాడి ఘటనపై ఎంఎల్ఎ వంశీ మోహన్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఘటనతో తనకు సంబంధంలేదని అన్నారు. ఎక్కడ ఏం జరిగినా తనకు అంటగడుతున్నారని పేర్కొన్నారు. ప్రతి చిన్న చిన్న ఘటనలపైనా తనపై సోషల్ మీడియాలో టిడిపి నేతలు ట్రోల్ చేస్తున్నారని విమర్శించారు. బయట నుండి టిడిపి నేతలు గన్నవరం రావడం వల్లే ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.

నా భర్తకు ఏదైనా జరిగితే సిఎం, డిజిపిదే బాధ్యత : పట్టాభి భార్య చందన



గన్నవరం పార్టీ కార్యాలయంపై దాడి విషయం తెలిసి తన భర్త అక్కడికి వెళ్లారని, అక్కడ ఆయనను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ భార్య చందన తెలిపారు. తన భర్త కారు డ్రైవర్, పిఎను పోలీసుస్టేషన్లో ఉంచారని, కానీ తన భర్త మాత్రం అక్కడ లేరని అన్నారు. పోలీసులు ఎక్కడకి తీసుకెళ్లారో తెలీదన్నారు. ఆయన ఫోన్ స్విచ్చాఫ్ వస్తోందన్నారు. తన భర్తకు ఏం జరిగినా ముఖ్యమంత్రి, డిజిపిదే బాధ్యతన్నారు.

గవర్నర్ల వీడ్కోలు, స్వాగత ఏర్పాట్లు

పర్యవేక్షించిన ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు

ప్రజాశక్తి - విజయవాడ, గన్నవరం : రాష్ట్ర బిశ్వభూషణ్ హరిచందన్‌కు వీడ్కోలు పలికేందుకు ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాన్ని విజయవంతానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు పేర్కొన్నారు. స్థానిక ఎ కన్వెక్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించనున్న గవర్నర్ వీడ్కోలు కార్యక్రమ ఏర్పాట్లను సోమవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా డిల్లీరావు మాట్లాడుతూ బిశ్వభూషణ్ హరిచందన్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన నేపథ్యంలో ఎ కన్వెక్షన్ సెంటర్‌లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. పలువురు న్యాయమూర్తులు, రాష్ట్ర మంత్రులు, శాసనమండలి, శాసన సభ్యులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ప్రభుత్వ సలహాదారులు, ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు. ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్, డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, డియంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డిసిఎస్‌వో పి.కోమలిపద్మ, డిఐపిఆర్‌వో ఎం.సురేంద్రనాథ్,

(మిగతా 6లో)

చాప కింద నీరులా కుష్టు మహమ్మారి

ఎన్‌టిఆర్ జిల్లాలో తాజాగా 52 మందికి నిర్ధారణ

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

ఎన్టీఆర్ జిల్లాలో కుష్టు వ్యాధి ఆందోళన కరంగా మారింది. చాప కింద నీరులా వ్యాప్తి చెందుతూనే ఉంది. లెప్రసీ నివారణ ప్రోగ్రామ్(ఎన్ఎల్ఇపి) కింద ఇటీవల చేపట్టిన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్(ఎల్‌సిడిసి)లో ఆందోళనకరమైన అంశాలు వెల్లడయ్యాయి. ఎన్టీఆర్ జిల్లాలో చేపట్టిన ఈ సర్వేలో సుమారు 52 మందికి కుష్టు వ్యాధి సోకినట్లు నిర్ధారించారు. వీరిలో 37 మందికి ఉధృతంగాను,15 ప్రమాదకర స్థాయి కంటే ఒక మోస్తరుగా వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఉధృతంగా ఉన్న వారిలో దాదాపు ముగ్గురికి అంగవైకల్యం మొదలైనట్లు గుర్తించారు. నవంబరు 15 నుంచి డిసెంబరు 5వ తేదీ వరకు ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఎల్‌సిడిసి నిర్వహించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వార్డు, గ్రామ సచివాలయాల ఆరోగ్య సిబ్బందితో పాటు వలంటీర్ల ద్వారా వివరాలు సేకరించారు. సుమారు 802578 మందికి స్క్రీన్ టెస్టులు నిర్వహించారు. వీరిలో 2222 మందిని సస్పెక్టెట్ కేసులుగా గుర్తించారు. జిల్లాలో విజయవాడ వెస్ట్‌తో పాటు మైలవరం, జగ్గయ్యపేట మండలాల్లో అధికంగా కేసులు వెలుగులోకి వచ్చాయి. మైలవరంలో 9 మందికి కుష్టు వ్యాధి సోకగా వీరిలో నలుగురికి ఉధృతంగాను, ఐదుగురికి కాస్తా తక్కువ స్థాయిలోను వ్యాధి లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా జగ్గయ్యపేట మండలం



బుచ్చవరం పిహెచ్‌సి పరిధిలో 6 మందికి కుష్టు వ్యాధి సోకగా ఆరుగురికి తీవ్రంగా రోగ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఏకొండూరు

(మిగతా 6లో)

ఏఐసిసి సభ్యునిగా మేడ సురేష్



ప్రజాశక్తి - గంపలగూడెం : ఆల్ ఇండియా జాతీయ కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా మేడ సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన 85వ ప్లీనరీ సమావేశంలో ఆల్ ఇండియా కాంగ్రెస్ తీసుకున్న ఈ నిర్ణయం మేరకు సురేష్ ఎంపికయ్యారు. గంపలగూడెం మండలం దుందిరాలపాడు - మల్లెంపాడు గ్రామానికి చెందిన సురేష్ కాంగ్రెస్ పార్టీలో పలు కీలక పదవులు చేపట్టి సేవలందించారు. అందులో భాగంగా 1992లో అఖిల భారత కాంగ్రెస్ లో జాయిన్ అయిన సురేష్ మండల యువజన అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా సేవలందించారు. 1998లో నాటి ఆంధ్ర - తెలంగాణ సమైక్య రాష్ట్ర సీఎం వైఎస్ఆర్ పాదయాత్ర నిర్వహణలో సురేష్ కీలక పాత్ర పోషించారు. విజయవాడ పార్లమెంట్ శిక్షణ తరగతుల కన్వీనర్ గా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, ఏపీ పార్టీ డాష్ బోర్డ్ ఇన్చార్జిగా, రాహుల్ జూడో యాత్రలో సైతం సురేష్ ప్రత్యేక పాత్ర పోషించారు. పార్టీలో అనేక సేవా కార్యక్రమాలు చేసిన ఫలితంగా సురేష్‌కు ఈ పదవి దక్కిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. తనకు తగిన ఈ పదవిపై రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. సురేష్కు దక్కిన ఈ పదవిపై పలువురు నాయకులు, కార్యకర్తలు హర్షం తెలిపారు.

పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : చిరిగిన చొక్కానైనా వేసుకో కానీ మంచి పుస్తకం కొనుక్కో అనే కందుకూరి వీరేశలింగం పంతులు సూక్తి ని అనుసరించి సిఎస్ఐ పాఠశాల రిటైర్డ్ టీచర్ బి. ఝాన్సీనీనా - శాంసన్ కుమార్ దంపతుల ద్వారా చిన్నారులకు పంపిన నీతి కథల పుస్తకాలు, జనరల్ నాలెడ్జి పుస్తకాలను "ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ" స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు విజయ్ కుమార్ చాట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీనీనా - శాంసన్ కుమార్ దంపతులకు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రాంతి, మల్లాది వెంకటరత్నం, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత రాజకీయాలకు తెరతీస్తున్న బిజెపి : మల్లాది విష్ణు

ప్రజాశక్తి-సింగ్‌నగర్ : రాష్ట్రంలో ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేందుకు మతపరమైన రాజకీయాలకు బీజేపీ తెరదీస్తోందని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. సోమవారం 58 వ డివిజన్ 258 వ వార్డు సచివాలయ పరిధిలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి ఆరో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శుభోదయ స్కూల్ రోడ్డు, జెండా చెట్టు సెంటర్, షాదీఖానా పరిసర ప్రాంతాలలో విస్తతంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి గ్రీవెన్స్ స్వీకరించి.. పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన ట్వీట్ ను సునీల్ దియోధర్, సోము వీర్రాజు తప్పుపట్టడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. అన్నార్తుల ఆకలి తీర్చడమే శివారాధన అని చెబుతూ.. వైసీపీ చేసిన ట్వీట్‌లో తప్పేముందని ప్రశ్నించారు. మానవ సేవే మాధవ సేవ అనే నినాదాన్ని కూడా మత రాజకీయాలకు వాడుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రామకష్ణ, ఏఎంఒహెచ్ రామకోటేశ్వరరావు, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, తోపుల వరలక్ష్మి, రహీం తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ కార్యక్రమాల బ్రోచర్ అందిస్తున్న ఎంఎల్ఎ మల్లాది విష్ణు

ధాన్యం బకాయిలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - గంపలగూడెం : : గడిచిన ఖరీఫ్ ధాన్యాన్ని ప్రభుత్వం ఆర్భాటంగా కొనుగోలు చేసింది గాని రైతులకు నేటికీ సొమ్ము జమ కాలేదని ఎన్టీఆర్ జిల్లా ఏపీ రైతు సంఘం అధ్యక్షులు మద్ది రెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందనలో సంబంధిత అర్జీని అందజేశారు. మండల అధ్యక్షుడు చెరుకు వీరారెడ్డి, కార్యదర్శి జానపాటి వెంకటేశ్వరరావు, నాళ్ళ సత్యంబాబు, ఎం గోపాల్‌రావు, రైతులు మద్దిరెడ్డి శ్రీనివాస రెడ్డి, వెంకట నరసింహారెడ్డి పాల్గొన్నారు. ప్రజాశక్తి-నందిగామ : రైతుల బకాయిలు చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతుల సంఘాల ఆధ్వర్యంలో ఆర్డిఓ ఆఫీస్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ గత 45 రోజులుగా ధాన్యం బకాయిలు రైతుల ఖాతాలలో జమ చేయడం లేదన్నారు. ఎన్టిఆర్ జిల్లా వ్యాప్తంగా 130 కోట్ల బకాయిలు ఉన్నాయని, నందిగామ డివిజనల్ పరిధిలో రూ.70 కోట్లు బకాయిలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కూడా నిలుపుదల చేశారని తెలిపారు. రవాణా, కాటా కూలి చార్జీలు చెల్లించడం లేదన్నారు. ధాన్యం తోలిన 21 రోజులలో డబ్బులు రైతుల ఖాతాలలో జమ చేస్తానన్న ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. అనంతరం ఆర్డీఓ రవీంద్రరావుకు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు యర్రా శ్రీనివాసరావు, కమతం పుల్లారావు, కౌలు రైతుల సంఘం నాయకులు సందె పోగు లింగయ్య, వ్యకాస నాయకులు సయ్యద్ ఖాసిం, సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కె గోపాల్ పాల్గొన్నారు.



గంపలగూడెంలో ...



నందిగామలో...

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : బీసీల పక్షపాతిగా మరోసారి నిరూపించుకున్న సీఎం జగనన్నకు బీసీలు జేజేలు పలుకుతున్నారని ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ కొనియాడారు. సోమవారం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో కొత్తగా రానున్న 18 మంది ఎంఎల్‌సిలలో 11 మంది బీసీలకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగనన్న అని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చైర్మన్ శ్రీకాంత్ మాట్లాడుతూ సమాజంలో 50 శాతం పైగా ఉన్న బీసీలకు జగనన్న మొదట నుండి రాజ్యాధికారంలో పెద్దపీట వేస్తున్నా రన్నారు. బీసీలందరూ జగనన్న వెంట ఉంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు దుర్వేసుల హుస్సేన్, ఎస్‌పి. శేషగిరిరావు, జక్కుతారక మల్లికార్జునరావు, కోసూరి రమేష్, రమాకాంత్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కారక కర్మాగారాలపై చర్యలు కోరుతూ వినతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని చిల్లకల్లు యంపిడిఓ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జగ్గయ్యపేట పట్టణానికి చెందిన మేటికల శ్రీనివాసరావు వినతి పత్రాన్ని యంపిడిఓ జయచంద్ర, రెవెన్యూ అధికారి నాగరాజుకి సమర్పించారు. ఈ సంద ర్భంగా జగ్గయ్యపేట మండలం, పట్టణంలో కెమికల్, సిమెంట్ ఇతరత్రా కర్మాగారాలు ఆయా ప్రాంతాలల్లో గాలి, భూగర్భ జలాలు, పర్యావరణ కాలుష్యానికి కారణమవుతు న్నాయన్నారు. ప్రజలు పలు రకాల వ్యాధులకు గురౌ తున్నారని, కావున కాలుష్యానికి కారకులైన కర్మాగారాలపై చర్యలు చేపట్టాలని కోరారు.

కలిసికట్టుగా పనిచేయాలి

ప్రజాశక్తి-విజయవాడరూరల్ : విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని కార్యాలయంలో జేఎన్ ఎన్‌యుఆర్ఎం కాలనీ నుండి ప్రజలు వచ్చి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావును కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్ళీ చంద్రబాబు నాయుడు వస్తే తప్ప ఈ రాష్ట్రం బాగుపడదని, అందుకోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు.

కుంభ రవిబాబుకి అభినందనలు

ప్రజాశక్తి- భవానీపురం : ఆంధ్ర ప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభ రవిబాబు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమి తులయ్యారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ వైసిపి నాయకులు, ఆంధ్రప్రదేశ్ ఎస్టి కార్పొరేషన్ డైరెక్టర్ మద్దెల రామకృష్ణ సోమవారం కుంభ రవిబాబును కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి హృదయపూర్వక శు భాకాంక్షలు, అభినందనలు తెలిపారు.



దాడి పిరికిపందల చర్య : టిడిపి

ప్రజాశక్తి-వన్‌టౌన్ : గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై వంశీ అనుచరులు వైసీపీ గుండాల దాడి హేయమైన, పిరికిపంద చర్య అని పశ్చిమ నియోజకవర్గ టిడిపి మైనార్టీ నాయకులు ఎం.ఎస్. బేగ్ సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. తెలుగుదేశం పార్టీని ధీటుగా, దమ్ముగా ఎదుర్కోలేక టిడిపి కార్యాలయాలపై దాడులు సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో సైకోలకు గుండెల్లో భయం మొదలైందన్నారు. వైసీపీ పార్టీ దిగజారుడు రాజకీయాలు రోజు రోజుకు రాష్ట్రంలో ఎక్కువ అయ్యా యన్నారు. యువ నాయకుడు నారా లోకేష్ పాదయాత్రతో వైసీపీ నేతలకు ఊపిరి ఆడక దద మొదలైందన్నారు. దాడి ఘటనపై పోలీసులు ప్రేక్షక పాత్ర వహించటం దుర్మార్గపు చర్య అన్నారు.

సాయం అందజేత

ప్రజాశక్తి - గంపలగూడెం : మండలంలోని దుందిరాలపాడు గ్రామ సచివాలయ కార్యదర్శి నల్లగట్ల ప్రదీప్ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. గంపలగూడెం మండల సచివాలయ ఉద్యోగుల అసోసి యేషన్ నుండి ప్రదీప్ తల్లిదండ్రులకు తహసీల్దార్ జి బాలకష్ణారెడ్డి, ఎంపీడీవో వైపి రెడ్డి చేతుల మీదగా సోమవారం లక్ష రూపాయలు ఆర్థిక సాయం చేసినట్లు కొంగల అశోక్ తెలిపారు. మండల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ తల్లి కళ్యాణం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామ పట్టణం అంకమ్మ తల్లి దేవస్థానంలో ఆదివారం రాత్రి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ అంకమ్మ తల్లి ప్రభ ఊరేగింపు (తిరునాళ్ళ) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నందిగామ మాజీ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ తమ్మవరపు దుర్గ రావు, గోపాలం ,వెంకటేశ్వరరావు, అంకు బాబు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని ముక్త్యాల గ్రామంలో గల భవాని ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో సోమవారం దేవా దాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీలు లెక్కించారు. 15 రోజులు గాను రూ.2,76,612 లు ఆదాయము వచ్చిందని దేవస్థాన కార్య నిర్వహణాధికారి కె. నాగరాజు తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో వంశపారంపర్య ధర్మకర్త తరపున కెసిపి ప్రతినిధి రాంప్రసాద్ ఇతర దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఈ-నామ్ భూ బాధితుల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-నందిగామ : నందిగామలో ఈనామ్ భూబాధితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నందిగామ ఆర్డిఓ రవీంద్ర రావుకు వినతి పత్రం అందజేశారు. ఈనామ్ భూబాధితుల సమస్యల నివారణకు 22ఎ క్లాసుకు సవరణ చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చనుమోలు సైదులు, సిపిఎం నందిగామ మండల కార్యదర్శి కటారపు గోపాల్, సిపిఎం నాయకులు సయ్యద్ ఖాసిం, కర్రి వెంకటేశ్వరరావు లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 1955 , మద్రాసు ఎస్టేట్, ల్యాండ్ బిల్లు 1965 నందు నాటి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెక్షన్ 3(2ఎక్స్ఎ)లను సవరించిందన్నారు. 07.01/1948 నాటికి ఎవరి స్వాధీనంలో ఉన్న ఈనామ్ భూములను వారికి రైతువారి పట్టాలు మంజూరు చేయుటకు వీలుగా నిబంధనలు జారీ అయ్యాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ఏరియా) ఈనామ్స్ (అటాలిషన్ అండ్ కన్వర్ట్ ఇన్ టు రైత్వారీ) యాక్ట్ 1956, నెం. 37 ననుసరించి నాడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక రెవిన్యూ కోర్టులలో ఇచ్చిన తీర్పులతో ఈనామ్ భూములు రైత్వారీ పట్టాలు మంజూరు చేశారన్నారు. ఈ పట్టాలు పొందిన భూముల యజమానులు వాటిని అమ్మగా అనేకమంది వాటిని కొనుగోలు చేసి ఇండ్ల ప్లాట్స్ గా మార్చుకున్నారని తెలిపారు. కొంతమంది దగ్గర మాత్రం భూముల రూపంలో ఉన్నాయన్నారు. ఈ స్థలాల్లో ఎక్కువశాతం పేద, బడుగు, మధ్యతరగతి కుటుంబాలు వేల సంఖ్యలో ఇండ్లు కట్టుకొని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. కాగా అకస్మాత్తుగా నాటి ప్రభుత్వం 2013వ సంవత్సరంలో యాక్ట్ నెం. 16 ను అమలులోకి తెచ్చిందన్నారు. ఈ చట్ట సవరణ ను చట్టం తెచ్చిన నాటి నుండి జ విచక్షణా రహితంగా వెనుకటి నుండి 26.11.1966 నుండి వర్తింప చేయటం వల్ల 50 సంవత్సరాల నుండి జరిగిన లావాదేవీలన్నీ రద్దయినాయన్నారు. కాబట్టి ఈ నామ్ భూములను సదరు జాబితాల నుండి తొలగించుటకు న్యాయపర చిక్కులు తలెత్తకుండా తగిన చట్టం తేవాలని ఈనామ్ భూబాధితుల పక్షాన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ కార్యదర్శి కె గోపాల్ కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసిం కర్రి వెంకటేశ్వరరావు జి గోపి నాయక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-చల్లపల్లి : రైతు సంఘాలను బలోపేతం చేసి రైతు సమస్యలపై ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలగపూడి ఆజాద్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అవనిగడ్డ నియోజకవర్గం సమావేశం సోమవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస్ కేంద్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆజాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినఆర్.బి.కె కేంద్రాలు రైతులకు భరోసా కల్పించలేకపోతున్నాయని ఆరోపించారు. ఆర్‌బికే ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లింపులలో తీవ్ర జాప్యం జరుగుతుందని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు చేసిన వెంటనే నగదు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం కొనుగోళ్లలో కూడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అధికారులు టార్గెట్ పూర్తయిందని చెప్పి ధాన్యం సేకరించడంలేదని రైతులు వాపోతున్నారన్నారు. గత సంవత్సరం మార్చి నెలాఖరు వరకు ధాన్యం కొనుగోలు జరగగా ఇప్పుడు టార్గెట్ అయిపోయిందని చెప్పడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరం గా మారిందని తెలిపారు. రైతు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులతో కలిసి చల్లపల్లి తహసీల్దార్ గోపాలకష్ణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు వేమూరి రత్నగిరి రావు, అట్లూరి వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు కొండయ్య, పరుచూరి శ్రీనివాసరావు, మాలెంపాటి కాంచనరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



బాల శాస్త్రవేత్తలే లక్ష్యంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు

- పాఠశాల విద్య, ఆర్జేడీ జి. నాగమణి

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : విద్యార్థుల్లో దాగివున్న సజనాత్మకతను వెలికితీసి బాల శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని పాఠశాల విద్య, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.నాగమణి అన్నారు. సోమవారం ఆమె స్థానిక లేడీయాంప్తిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలల జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభోత్సవం చేశారు. జిల్లాలోని 215 పాఠశాలల నుంచి 130కు పైగా విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన ఈ ప్రాజెక్టులు రాబోయే కాలంలో ఆవిష్కరణలుగా రూపొందాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఆ దిశగా నూతన ఆవిష్కరణలు చేపట్టేలా ప్రేరణ కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని పేర్కొన్నారు. విద్యాభివద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా కోట్లలో ఖర్చు పెడుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 28న విజయవాడలో రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరుగుతుందని, విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించాలని ఆమె తెలిపారు. జిల్లా విద్యాశాఖాధికారిణి తహెరా సుల్తానా మాట్లాడుతూ ప్రతి ఒక్కరి దైనందిన కార్యక్రమాల్లో సైన్సు అంతర్భాగమున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా అద్భుతాలు సష్టిస్తారని, పాఠశాల స్థాయి నుంచే నూతన ఆవిష్కరణలు కనుగొనేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు బాటలుగా నిలుస్తాయన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తిప్పలమల్లి జమల పూర్ణమ్మ మాట్లాడుతూ జిల్లా గ్రంథాలయాలను పాఠశాలలకు అనుసంధానం చేస్తూ విద్యార్థులకు చదువు పట్ల మరింత ఆసక్తిని కలిగించి భవిష్యత్తులో అభివద్ధి సాధించేలా కషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముందు అతిథులు విజ్ఞాన రంగంలో గొప్ప ఆవిష్కరణలు రూపొందించిన శాస్త్రవేత్తులు సివి.రామన్, అబ్దుల్ కలామ్ చిత్రపటాలకు పుష్పాలంకరణ చేశారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలను అతిథులు ప్రారంభోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఈఓ యు వి.సుబ్బారావు, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ జఖీర్, ఏడీ అజీజ్, ప్రధానోపాధ్యాయురాలు వి.మెటిల్డారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.



సస్య భారత్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నంలోని శ్రీ చైతన్య హైస్కూల్ షార్ట్ లివింగ్ ప్రోగ్రామ్లో భాగంగా సస్య భారత్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి నెల జరిగే కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నం మండలం లోని సల్తానగరం గ్రామంలో సస్య భారత్ పై విద్యార్థులు స్వయంగా పంట పొలాల్లోకి వెళ్ళి పర్యవేక్షించి రైతు ప్రాముఖ్యత, పంట మొక్క ప్రాముఖ్యతను గురించి వివరించారు. వ్యవసాయమే ప్రధాన వనరుగా ఉన్న మన భారత దేశములో రైతే దేశానికి వెన్నెముక" అని విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అని, దానిని వధాగా పారవేయడం వలన రైతు కష్టాన్ని గుర్తించలేకపోతున్నామని, దానిని విద్యార్థులు గుర్తించాలన్నారు. రైతు, కూలీల వేషధారణలో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఎ.జి.యం. ఎమ్. మురళీ కష్ణ, ఆర్. వి. జె. రాజేష్ బాబు, జోనల్ అకడమిక్ కో ఆర్డినేటర్ ఎమ్. అశోక్,ప్రిన్సిపల్ ఆర్. శ్రీనివాసరావు, డీన్ పి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ

పెనమలూరు : విజయవాడ రవీంద్రభారతి విద్యాసంస్థలు తులసీనగర్‌కు చెందిన విద్యార్థులు ఇంటర్ డోజో కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనపర్చారు. కటా విభాగంలో ఏడవ తరగతి చదువుతున్న జి.నిస్సి, వి. మేఘన, సిహెచ్ శ్రీరాగవర్షిత్, ఎండి ఖతీబ్‌లు మొదటిస్థానం, అలాగే 6వ తరగతి చదువుతున్న ఆర్. దీవెన మూడవ స్థానం సాధించారని ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, ఆత్మరక్షణ కళలలోనూ నైపుణ్యాన్ని సాధించాలన్నారు.

అర్జీల పరిష్కారానికి కృషి చేయాలి : డిఆర్‌ఓ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : స్పందన అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. స్పందన సమావేశపు మందిరంలో సోమవారం కలక్టరేట్ స్పందన హాలులో డిఆర్డిఎ పీడీ పి.యస్.ప్రసాద్ తో కలసి అర్జీలను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వద్ద నుంచి మొత్తం 94 అర్జీలు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ అర్జీదారులు విన్నవించిన సమస్యను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి వారికి సంతృప్తికరమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. అధికారులకు నిర్దేశించిన గడువు లోగా అర్జీలను పరిష్కరించే విధంగా కషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మనోహర్ రావు, సివిల్ సప్లైస్ డి ఎం డాక్టర్ ఏ. శ్రీధర్ ,సర్వే మరియు భూ రికార్డుల శాఖ ఏడి ఎస్ గోపాల్ రాజా, డివిజనల్ పంచాయతీ అధికారి జ్యోతిర్మయి, అధికారులు పాల్గొన్నారు.




ధాన్యం బకాయిలు చెల్లించాలి : టిడిపి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో గత 45 రోజులుగా ధాన్యం బకాయిలు రైతుల ఖాతాలలో జమ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని టిడిపి తెలుగు రైతు మచిలీపట్నం పార్లమెంటు అధ్యక్షుడు, మచిలీపట్నం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, గోపు సత్యనారాయణ. విమర్శించారు. స్థానిక నియోజక వర్గ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ ధాన్యం తోలిన 21 రోజులలో డబ్బులు రైతుల ఖాతాలలో జమ చేస్తానన్న ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందన్నారు. ధాన్యం అమ్మటంతో బాకీలు ఇవ్వమని అప్పులు ఇచ్చినవారు రైతులపై ఒత్తిడి చేస్తున్నాన్నారు. ధాన్యం అమ్మిన డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కూడా నిలుపుదల చేశారు. రవాణా, కాటా కూలి చార్జీలు చెల్లించడం లేదన్నారు.అదేవిధంగా రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నా యన్నారు. రైతులకు సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా ప్రభుత్వం దగా చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో మచిలీపట్నం పార్లమెంట్ ప్రచార కార్యదర్శి, పి వి ఫణి కుమార్, పార్టీ నగర ప్రధాన కార్యదర్శి, పిప్పళ్ళ వెంకట కాంతారావులు ఉన్నారు.

మానవత, నైతికత ఉద్యమ ప్రచారం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : స్థానిక ఇనకుదురుపేటలో జమాతే ఇస్లామి హింద్ మినార్ మస్జిద్ కమిటీ, మచిలీపట్నం శాఖ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం మానవతా నైతికత ఉద్యమ ప్రచారంను నిర్వహించారు. మనుషులలో కొరవడుతున్న మానవతా విలువలను కాపాడేందుకు నైతిక బాధ్యతను వివరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మనుషులందరూ సమానమని అందరినీ పుట్టించిన సష్టికర్త ఒక్కడేనన్న సత్యాన్ని మనిషి గ్రహించాలన్నారు. మతం, సంస్కృతి, భాష కంటే మానవత్వం గొప్పదని గ్రహించి మనిషిని ప్రేమించాలన్నారు. దేశభక్తి, దేశాన్ని ప్రేమించడం అంటే మనుషులందరినీ కులమత రహితంగా ప్రేమించడమని తెలుసుకోవాలన్నారు. మానవ ప్రాణం అత్యంత విలువైనదని, పవిత్రమైనదని గ్రహించాలని తెలిపారు. ప్రముఖ పత్రిక లేఖరి షరీఫా బేగం, రేవెరంట్ అమతారావు, జెఐహెచ్ మహిళా విభాగం జిల్లా బాధ్యులు అస్మా, సాబెరా, షేహ్నాజ్, తరన్నుమ్, పద్మజా, అనిత, వసంత పాల్గొన్నారు.

మాణిక్యాలరావుకు ఘన నివాళి



కార్యక్రమంలో పాల్గొన్న లిట్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ , దుక్కిపాటి శశిభూషణ్ తదితరులు



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు లాం తాంతియాకుమారి, తదితరులు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ మండలం లింగవరం గ్రామంలో అభిమానుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దివంగత మట్టా మాణిక్యాలరావు సంతాప కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల ప్రముఖులు, మాణిక్యాలరావు చిత్రపటానికి నివాళులర్పించి ప్రజానీకానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, వైసిపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు లాం తాంతియా కుమారి, గుడివాడ, నందివాడ ఎంపీపీలు పెయ్యల ఆదాం, గద్దె పుష్ప రాణి, జడ్పిటిసి గొళ్ళ రామకష్ణ, దళిత సంఘాల నాయకులు పొంగిలేటి జయరాజు, కంచర్ల సుధాకర్, వెంపటి సైమన్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ నగుళ్ల సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మొండ్రు వెంకటేశ్వరరావు, వైయస్సార్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర నాయకులు దారం ఏడుకొండలు, వైఎస్ఆర్పిపి వికలాంగుల విభాగ రాష్ట్ర నాయకులు దొండపాటి మధు కిరణ్ పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు, ప్రజా ప్రతినిధులు మాణిక్యాలరావు సంతాప కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. తండ్రి మార్గంలోనే ప్రజా జీవితంలో పయని స్తున్న ఆయన కుమారుడు మట్టా జాన్ విక్టర్‌ను ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు అభినందించారు.

'విజయ' విద్యార్థులకు పతకాలు



ప్రజాశక్తి-చల్లపల్లి : రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో చల్లపల్లి విజయ అకాడమీ విద్యార్థులు పతకాలు సాధించారని ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు తెలిపారు. జపాన్ షిటో రూయు కరాటే స్కూల్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు మండలం వేమవరంలో ఈనెలలో జరిగిన 14వ ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ 2023 టోర్నమెంట్ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారన్నారు. తమ పాఠశాల నుండి కరాటే కటా ఈవెంట్ సబ్ జూనియర్స్ విభాగంలో మూడో తరగతి చదువుతున్న కొండపల్లి పార్థవసాయి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం, మొవ్వ ఫణి గిరిధర్, బత్తుల హర్షిత్ మూడవ స్థానంలో నిలిచారన్నారు. కుమిటీ ఫైట్ విభాగంలో మోటుపల్లి మనోజ్ఞ మాన్వి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది అని వివరించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థినీ విద్యార్థులను సోమవారం పాఠశాల ఆవరణలో కరస్పాండెంట్ గొర్రెపాటి చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ నాగళ్ళ భీమారావు, ఏఓ వేమూరి విశ్వేశ్వరరావు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందించారు.



వాస్తు డెయిరీ ప్రీమియం గోల్డ్ నెయ్యి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ప్రముఖ పాలు, పాల ఉత్పత్తుల ఉత్పత్తిదారులు రాధే డైరీ ఫామ్ అండ్ ఫుడ్స్ లిమిటెడ్ (వాస్తు డైరీ) ఆధ్వర్యంలో సరికొత్త ఉత్పత్తి ప్రీమియం గోల్డ్ నెయ్యిని మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ చైర్మన్ భూపత్ సుఖాడియా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమియం గోల్డ్ నెయ్యి రెండు రకాల్లో ఆవునెయ్యి, గోల్డ్ దేశీ నెయ్యి వస్తుందన్నారు. ఇది అత్యుత్తమ నాణ్యమైన వెన్నతో తయారు చేయబడిందని తెలిపారు. సరికొత్త ప్రీమియం ఉత్పత్తులు నాణ్యత, ఆరోగ్యం, నమ్మకాన్ని అందించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. రానున్న కాలంలో మరిన్ని ఉత్పత్తులను నగర మార్కెట్లోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

అన్నవరపు బ్రహ్మయ్యకు పురస్కారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: సీనియర్ పాత్రికేయులు, బహుగ్రంథ రచయిత, తెలుగు తోరణం పత్రిక సంపాదకులు అన్నవరపు బ్రహ్మయ్యను



మాతృభాష సేవ శిరోమణి పురస్కారానికి అధికార భాషా సంఘం ఎంపిక చేసినట్లు ఆ సంఘం అధ్యక్షులు విజయబాబు ప్రకటించారు. ఈ అవార్డును విజయవాడలో మంగళవారం జరిగే అధికారిక కార్యక్రమంలో అందజేస్తారు. 1981వ సంవత్సరంలో జర్నలిజంలో ప్రవేశించిన అన్నవరపు బ్రహ్మయ్య వివిధ హోదాల్లో ఈనాడు, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి దినపత్రికల్లో పని చేశారు. ప్రస్తుతం తెలుగు తోరణం పత్రికకు వ్యవస్థాపక సంపాదకునిగా ఉన్నారు. జీవన వికాసం, తొలి వైద్యులు, సర్దార్ సంజన్న, కేశఖండన వంటి పలు పుస్తకాలను బ్రహ్మయ్య రాశారు.

దళితవాదాన్ని వినిపించాలి

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: దళిత వాదాన్ని బలంగా వినిపించాల్సిన అవసరం ఉందని ఐద్వా నాయకురాలు రమాదేవి అన్నారు. ఎండ్లూరి మానస, అరుణ, గోగుల మండ సంకలన పరచిన ముళ్ల చినుకులు దళిత కథా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం శిఖామణి సెంటర్‌లోని శిఖరా పాఠశాలలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా కథా సంకలనాలను ఆవిష్కరించిన రమాదేవి మాట్లాడుతూ దళితుల పట్ల పాలక పక్షాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, వాటిని ఎదుర్కోవడానికి పోరాటం చేయాలన్నారు. ప్రముఖ కవి అరసవిల్లి కృష్ణ కథాసంకలనాన్ని సమీక్ష చేస్తూ కథలు వాస్తవానికి దగ్గరగా ఉన్నాయని తెలిపారు. ఏ సాహిత్యమైనా ప్రజల నుండి రావాలని, ప్రజల కోసమే రాయాలని సూచించారు. కథా సంకలన సంపాదకులు మానస, అరుణ మాట్లాడుతూ తాము అనుకున్న లక్ష్యం నెరవేరిందన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి శాంతిశ్రీ సభకు అధ్యక్షత వహించగా, విద్యావేత్త బండ్ల మాధవరావు, యువకవి అనిల్ డ్యానీ, కంచర్ల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మక ఆలోచనల కోసం డైనాస్టార్ పోటీ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: టఫే ట్రాక్టర్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ సంస్థ మాస్సే డైనాస్టార్ పోటీ-2023ను నిర్వహిస్తున్నట్లు సంస్థ రీజనల్ ప్రతినిధి కె.ఎస్.ఆర్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. సృజనాత్మకమైన ఆలోచనలు కలిగిన రైతులు, పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లు, విద్యార్థులు, విద్యావేత్తలు ఎవరైనా ఈ ఆన్‌లైన్ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. వ్యవసాయ రంగంలో కొత్త ఆలోచనలు తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఈపోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలో పాల్గొనే వారు టఫే సంస్థ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 27వ తేదీ వరకు పేర్లను నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. పోటీలో విజేతలకు రూ.7.5 లక్షల విలువైన ట్రాక్టర్ బహుమతిగా అందించనున్నారని తెలిపారు.

డ్రైనేజీ లేక రోడ్లపైనే మురుగు

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల లో పారిశుధ్య సమస్య అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామంలో ఆయా కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు పారుదల కాక ఎక్కడికక్కడే పేరుకుపోయింది. కొన్ని చోట్ల మురుగు నీరు రోడ్ల పై చేరుతుంది. దీంతో గ్రామంలో మురుగు వాసనకు దోమల స్వైరవిహారం చేస్తున్నాయి.. స్థానిక వసంత కాలని లో ఏ వీధిలో చూసినా రోడ్డు పక్కన డ్రైనేజీ వ్యవస్థ లేదు. దీంతో స్థానిక ఫైర్ స్టేషన్ పక్క వీధిలో, తిరుపతమ్మ దేవాలయం వీధిలో ఇళ్ళల్లో వాడుకునే మురుగు నీరు రోడ్ల పై నిల్వ చేరి ప్రజలు నడవటానికి ఇబ్బందిగా ఉంది. దుర్వాసన కూడా వెదజల్లటం వల్ల దోమల స్వైరవిహారం చేస్తున్నాయని ప్రజలు అంటున్నారు. హనుమాన్ పేట, జంగాల కాలనీ, ఇందిరా కాలనీ,అంబేద్కర్ కాలనీ, అరుంధతి కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక ఎక్కడి మురుగు అక్కడే పేరుకుపోయి దుర్వాసన వెదజలుతుందని ప్రజలు అంటున్నారు. స్థానిక పాత పోలీస్ స్టేషన్ రోడ్ లో శివాలయం వద్ద కాలవలో రెండడుగులు మేర మురుగు నీరు నిల్వ చేరింది. అక్కడి వెదజల్లే దుర్వాసనకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు వసంత కాలని, ఇందిరా కాలనీ, జంగాల కాలనీ, పెద్ద బజారు, ఒకటో వార్డు, శివాలయం వీధిలో ఇటీవల కొద్ది నెలల క్రితం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో



మురుగు నీరు పారుదల కాక దుర్వాసన వెదజలుతుందని, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, అంటురోగాల బారిన పడుతున్నామని మహిళలు ఎమ్మెల్యే కు మొర పెట్టుకున్నారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వైసిపి అధికారంలోకి వచ్చి 4 ఏళ్ళ గడిచినా కనీసం కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక వసతులు కూడా కల్పించటంలో పాలకులు తగిన శ్రద్ధ చూపలేదని, ఎన్నికల సమయంలో ఓట్ల కోసం దండాలు పెట్టి, ఎన్నికల్లో గెలిచాక సమస్యలు గురించి పట్టించుకున్న పాపాన పోలేదని మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారంలో ఉన్న పాలకులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై దష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



కీసరలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలం కీసర గ్రామంలో సోమవారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు ఇంటింటికీ తిరిగి పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేశారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం రామకృష్ణ, కలతోటి అజయ్, రోశయ్య, కుక్కల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వత్సవాయి: వైసిపి ప్రభుత్వం భూస్థాపితానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ అన్నారు. మండల కేంద్రమైన వత్సవాయిలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చేపట్టారు. తాతయ్య గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఏకమై వైసీపీని తరిమికొడుతూ జగన్ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దొంతు చిన్న, వడ్లమూడి రాంబాబు, నెల్లూరి శ్రీను, చిట్టూరి రమేష్, పెద్ది రామారావు, కణతాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : రక్షణనిధి

ప్రజాశక్తి-ఎ.కొండూరు: రాజకీయ పార్టీలకు, కుల మతాలకు అతీతంగా అర్హత కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలగడ్డ రక్షణనిధి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఎ.కొండూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని గిరిజన తండాలలోని కిడ్నీ బాధితులందరికీ రూ.38 కోట్లతో శుద్ధి చేసిన కృష్ణా జలాలను అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలంలో పది ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి రూ.6 కోట్లతో 50 ట్యాంకుల ద్వారా స్వచ్ఛమైన కృష్ణాజలాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే తన ఎమ్మెల్యే గ్రాండ్ నుండి మండలాభివృద్ధికి రూ.50 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. గొల్లమందల తండాలో ప్రజల సౌకర్యార్థం సెంటున్నర భూమిని కొనుగోలు చేసి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడానికి తన సొంత నిధులు రూ.లక్ష ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి భూక్యాగనియా, గుంటక శివారెడ్డి, సిద్ధం పద్మ, సర్పంచ్ వెంపాటి రజిని, తహసీల్దార్ సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో పి విఎస్ నాగేశ్వరరావు, ఎంఈఓ ఎం.రాజశేఖర్, సిహెచ్ లక్ష్మి, డాక్టర్ రాధిక, హౌసింగ్ ఏఈ ఎం.రత్నజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం డబ్బులు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి-ఎ.కొండూరు: రైతు భరోసా కేంద్రం ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి రెండు నెలలు గడుస్తున్నా నేటి వరకు డబ్బులు చెల్లించలేదని, దీంతో తమ పరిస్థితి ముందు నుయ్యి వెనక గొయ్యి అన్నట్లుగా ఉంది అంటూ కంభంపాడు గ్రామానికి చెందిన రైతులు ఆంధ్రప్రదేశ్



రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ సన్న చిన్న కారు రైతులతో పాటు కౌలు రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం రైతు భరోసా కేంద్రం ద్వారా కొనుగోలు చేసిందని, సకాలంలో రైతులకు డబ్బులు అందకపోవటం వల్ల వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక కౌలు రైతులు కౌలు చెల్లించే పరిస్థితి లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే రైతులకు రావాల్సిన డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎస్ రామకృష్ణారెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు పానెం ఆనందరావు, సిఐటియు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలసు సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: స్పందన అర్జీలను ఆయా శాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు ఆదేశించారు. స్థానిక పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం కలెక్టర్ డిల్లీరావు అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. గ్రామ మండల స్థాయి అధికారులు వారి పరిధిలో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. రీ ఓపెన్ అవుతున్న అర్జీలకు సంబంధించి ప్రతి శనివారం సంబంధిత అధికారులు అర్జీదారులతో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తూ అన్ని స్థాయిల్లోను అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కారం చూపుతున్నామని కలెక్టర్ డిల్లీరావు తెలిపారు. స్పందనలో 101 వినతులు నమోదయ్యాయని తెలిపారు.

ప్రణాళికబద్ధంగా చదవాలి

ప్రజాశక్తి-తిరువూరు: ఏమాత్రం ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.మురళీకృష్ణ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. మండలంలోని గానుగ పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పదవ తరగతి విద్యార్థులకు సోమవారం పరీక్షలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ జీవితంలో పదవ తరగతి అత్యంత కీలకమైందన్నారు. అంతటితో చదువు ఆపకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.జి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



ముగిసిన క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు మండలం లక్ష్మీపురంలో రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో జరి గిన సూపర్-7 బాక్స్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర ల్లోని వివిధ ప్రాంతాల నుండి పాల్గొన్న క్రీడాకారులలో గెలుపొందిన వారికి నగదు బహుమతులను జడ్పిటిసి యరమల రామచంద్రారెడ్డి చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

61వ డివిజన్లో డ్రెయినేజీ సమస్య

ప్రజాశక్తి-సింగ్‌నగర్: 61వ డివిజన్ ప్రకాష్‌నగర్ సెంటర్, కనకదుర్గ గుడి రోడ్డు మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతూ విపరీతమైన దుర్వాసన, దోమల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీని వల్ల 50 కుటుంబాలకు చెందిన ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశముంది. ఈ విషయాన్ని స్థానిక సిపిఎం నగర నాయకులు చింతల శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా యుజిడి సెక్షన్ అధికారికి ఫోన్ చేసి తెలిపినా స్పందించలేదు. సంబంధిత తగు చర్యలు తీసుకోకపోతే ధర్నాకు దిగుతామని ఆయన హెచ్చరించారు.



ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

మండల ప్రత్యేకాధికారి ఫణి కుమార్

ప్రజాశక్తి-పెదపారుపూడి

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్ జగనన్నకాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి వి.వి.ఫణి



సమావేశంలో మాట్లాడుతున్న ఫణికుమార్

కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జగనన్న శాశ్వత గృహ హక్కు పథకంపై పెదపారుపూడి మండలంలోని అన్ని గ్రామాల్లోని సచివాలయ స్థాయి ప్రత్యేక అధికారులను నియమించారు. భూషణగుళ్లకు ఎస్.త్రినాథ్ ఆంజనేయరావు, చినపారుపూడి-కె.వసంతరావు, పాములపాడు-ఎం.నాగిరెడ్డి, యలమర్రు-హెచ్.జయంత్, మోపర్రు-డి.రామ్మోహనరావు, పెదపారుపూడి 2-ఎన్.స్ఫూర్తి, వానపాముల-ఎన్.మల్లికార్జునరావు, వెంట్రప్రగడ-వి.రమణారావు, వెంట్రుప్రగడ-షహనాజ్ ఉత్తర్వులు జారీచేశారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు మేలు : దిలీప్‌కుమార్

ప్రజాశక్తి-పమిడిముక్కల

దేశంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే పేదల సంక్షేమం బాగా జరిగిందని పామర్రు



నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి పెదపూడి దిలీప్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ జోడో యాత్ర విజయవంతమైన సందర్భంగా పమిడిముక్కల మండలం కృష్ణాపురంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ జూడో యాత్ర దేశ సమగ్రతకు మేలు చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వస్తుందన్నారు. ధాన్యాన్ని విక్రయించిన రైతులకు ఒక్క రోజుకే రైతుల ఖాతాలో డబ్బులు పడతాయన్నారు.

బాధితులను ఆదుకోలేకపోవటం సిగ్గుచేటు

ప్రజాశక్తి-అవనిగడ్డ

చింతలమడ రోడ్డు ప్రమాద బాధితులను రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఆదుకోలేకపోవడం సిగ్గుచేటని మాల



మహానాడు జిల్లా కన్వీనర్ దోవా గోవర్ధన్ విమర్శించారు. సోమవారం ఆయన అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల తాను బాధితులను కలిసి అండగా నిలిస్తే నైతికత లేదని విమర్శలు చేస్తుండటం దారుణమని ఖండించారు. 9 నెలలు గడుస్తున్నా బాధితులకు న్యాయం చేయలేకపోవడాన్ని ఏమంటారని ప్రశ్నించారు. పరిహారం కోరడం రాజకీయ విమర్శ కాదన్నారు. కంటితుడుపు చర్యలతో బాధితులకు పరిహారం ఇచ్చినట్లుగా సరిపోల్చటం ప్రజా ప్రతినిధులకు తగదన్నారు.



బహుమతులు అందజేస్తున్న కెఎస్ లక్ష్మణరావు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-గన్నవరం

విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదవటం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శాసనమండలి సభ్యులు కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. పెట్ల పార్వతి మెమోరియల్ ట్రస్ట్ కొండపల్లి ఉంగుటూరు మండలం తేలప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెట్ల కామేశ్వరరావు వారి తల్లితండ్రుల జ్ఞాపకార్ధం ప్రతిభ వంతులైన పేద విద్యార్థుకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ముఖ్యఅతిథిగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఉన్నతంగా చదువు కుంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చునన్నారు. ఉషారామ కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రాజశేఖరరావు, జాకీర్ హుస్సేన్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహాభాష మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. ఎంపిడిఒ జిఎస్‌వి శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న జగనన్న వసతి దీవెన, విద్యాదీవెన, అమ్మఒడి, విద్యా కానుక, గోరుముద్ద వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ బషీర జాస్మిన్ నేషనల్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ (బీహార్), పెద అవుటపల్లికి చెందిన యేటగిరి నాగ లక్ష్మి ఇండియన్ రగ్బీ ఫుట్ బాల్ యూనియన్ ఛాంపియన్‌షిప్ (గుజరాత్)లో పాల్గొన్నందున ప్రోత్సాహంగా రూ.1000 చొప్పున వారికి నగదును అందజేశారు. సర్పంచ్ లాం దిబోరా, హెచ్ఎం బి.సరోజినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

దుగ్గిరాల శ్రీశైలం మల్లికార్జునకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

మండలంలోని అంగలూరు గ్రామానికి చెందిన విశ్రాంత తెలుగు పండితులు దుగ్గిరాల



శ్రీశైలం మల్లికార్జునరావు ఐదో వర్ధంతి కార్యక్రమం సోమవారం జరిగింది. పాఠశాలలోని జూనియర్ ఇంటర్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు జతలు ఏకరూప దుస్తులు, షూస్‌ను ఆయన కుటుంబీకులు రూ.50వేలు విలువ గలవి అందజేశారు. మల్లికార్జునరావు దాతృత్వాన్ని గ్రామ సర్పంచ్ మేడేపల్లి రవికుమార్, ఉప సర్పంచ్ త్రిపురనేని సురేష్ బాబు, గ్రామ పెద్దలు దుగ్గిరాల శేషుబాబు, దుగ్గిరాల కృష్ణమూర్తి, దుగ్గిరాల మాధవరావు, నాగేశ్వరరావు, హెచ్ఎం గొట్టిపాటి గురుప్రసాద్, రిటైర్డ్ తెలుగు పండిట్ రామ చంద్రచార్యులు, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సక్సేనారాజు, బంధువులు, గ్రామస్తులు విశేషంగా కొనియాడారు.

అనధికార వాటర్ ప్లాంట్‌ను నిలిపేయాలి

ప్రజాశక్తి - మొవ్వ

మొవ్వ మండలం కూచిపూడి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలోని సుజలాం వాటర్ ప్లాంట్ అద్దె నిర్వహణలో వచ్చే నష్టాన్ని భర్తీ చేయాలంటూ నిర్వాహకులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు సోమవారం మొవ్వ తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందనలో ఫిర్యాదు చేశారు. తహశీల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఆర్‌డబ్ల్యుఎస్, ఎటిఎం వాటర్ సిస్టమ్స్, గ్రామ పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో ఒప్పంద ప్రాతిపదికన సుజలాం వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పది సంవత్సరాలు పాటు ఎన్నో ఒడి దుడుకులు ఎదుర్కొంటూ కరోనా కష్టకాలంలో కూడా లాభాపేక్ష లేకుండా నిర్వహించామని వెంకటేశ్వరరావు పేర్కొన్నారని చెప్పారు. ఒప్పంద గడువు ముగియటంతో 2022 నుంచి పంచాయతీ పాలకవర్గ అనుమతితో అధికారులు నిర్ణయించిన ప్రకారం తిరిగి తానే సుజలాం వాటర్ ప్లాంటును అద్దెకి తీసుకొన్నట్లు నిర్వాహకుడు తెలిపారన్నారు. ఇటీవల తన నిర్వహణలోని సుజలాం వాటర్ ప్లాంట్ కు అతి సమీపంలో అనుమతి లేకుండా వాటర్ ప్లాంట్ ప్రారంభించారని దీంతో తాను తీవ్ర నష్టాల పాలవుతున్నానని తెలిపాడన్నారు. దానిని తాత్కాలికంగా నిలపేసేందుకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కూచిపూడి పంచాయతీ నుంచి అద్దె మినహాయింపు ఇప్పించి నష్టాల నుండి తప్పించాలని నిర్వాహకుడు వెంకటేశ్వరరావు కోరుతూ స్పందనలో అర్జీ దాఖలు చేశారని తహశీల్దారు వివరించారు. కూచిపూడి జగనన్న కాలనీలో 94వ ప్లాటును తన అత్తకు ఇచ్చారనీ, 2021లో ఆమె మరణించారని పేర్కొన్నారు. ఈ దశలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ఈ స్థలాన్ని తనకు స్వాధీనం చేశారని వివరిస్తూ ఈ స్థలంలో ఇల్లునిర్మించుకోవడానికి అధికారులు రుణం మంజూరు చేయాలని కూచిపూడికి చెందిన పాలపర్తి వెంకటేశ్వరమ్మ దరఖాస్తు దాఖలు చేశారు.

సైన్స్ మోడల్ ప్రదర్శించిన విద్యార్థులంతా విజేతలే : జెసి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

సైన్స్ ప్రయోగాలు ప్రత్యక్షంగా చూస్తే జీవితాంతం



గుర్తుండిపోతాయని, అందుకే సైన్స్ ఫెయిర్స్ నిర్వహిస్తారని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. సోమవారం స్థానిక లేడీయాంప్తిల్ ప్రభుత్వ బాలికల పాఠశాల ఆవరణలో జిల్లా విద్యాశాఖ అధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు తిలకించారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు, డిఇఒ తాహెరా సుల్తానా, డిప్యూటీ డిఇఒ యువి.సుబ్బారావు, డిస్ట్రిక్ట్ సైన్స్ ఆఫీసర్ జఖీర్, ఏడీ అజీజ్, ప్రధానోపాధ్యాయురాలు వి.మెటిల్డారాణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం

ప్రజాశక్తి-గన్నవరం

అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక బాయ్స్ హాస్టల్‌లో గన్నవరం బర్ అసోసియేషన్ అధ్యక్షులు అమర్తల సోమేశ్వరరావు అధ్యక్షతన న్యాయవిజ్ఞాన




మాట్లాడుతున్న శిరీష

సదస్సు జరిగింది. అదనపు జూనియర్ సివిల్ జడ్జి శిరీష మాట్లాడుతూ సామాజిక న్యాయంలో న్యాయ వ్యవస్థ పాత్ర, రాజ్యాంగంలోని హక్కులు,బాధ్యతలు, ఉచిత న్యాయ సహాయం గురించి విపులంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు వైఆర్ శారద, సెక్రటరీ రామకూరి ప్రకాశరావు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ దాసరి భాగ్యలక్ష్మి, న్యాయవాది విమల్ కుమార్, వార్డెన్ వెంకటేశ్వరమ్మ, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

జనసేన సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండలంలో 10వ రోజు జనసేన పార్టీ క్రియాశీల సభ్యత నమోదు కార్యక్రమం సోమవారం జరిగింది. రాష్ట్ర మత్స్యకార వికాస విభాగం ప్రధాన కార్యదర్శి లంకె యుగంధర్, సీనియర్ నాయకులు ఉల్లి శేషగిరిరావులు స్థానిక ప్రధాన సెంటర్లో శ్రీ ఆంజనేయస్వామి గుడి వద్ద టెంటు వేసి 10 రోజులుగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. నరసింహపురం గ్రామానికి చెందిన బొంతు శేషగిరిరావుకు సభ్యత్వాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బడే వెంకటేశ్వరరావు, దామెర్ల నారాయణ, మేడ పిచ్చయ్య, జరుగు నారాయణ, నంద్యాల కృష్ణ, బండే యానాది, బండే నాంచారయ్య, ఉద్దండి వెంకటరమణ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న జనసేన నాయకులు

మొదటి పేజీ తరువాయి



గన్నవరంలో భయం...భయం...

కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. టిడిపి ఫ్లెక్సీలను చించివేవారు. రాళ్ల దాడిలో గన్నవరం సిఐకు, ప్రజాశక్తి విలేకరికి గాయాలయ్యాయి. సోమవారం జరిగిన ఈ ఘటన గన్నవరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దాడి నేపథ్యంలో చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారికి ఇరువైపులా టిడిపి, వైసిపి శ్రేణులు మోహరించాయి. అప్సర థియేటర్ సమీపంలో ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నారు. అప్రమత్తమైన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈక్రమంలో జాతీయ రహదారిపై మరోసారి మరింత ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం టిడిపి నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీంతో 3 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది.



గాయపడిన ప్రజాశక్తి విలేకరి ఎన్.శ్రీనివాస్



గన్నవరం వెళతున్న టిడిపి నేతలను అడ్డుకున్న పోలీసులు

టిడిపి కార్యాలయంపై దాడి నేపథ్యంలో సోమవారం రాత్రి గన్నవరం వెళుతున్న పలువురు టిడిపి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ మంత్రి దేవినేని ఉమాలను విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. టిడిపి నాయకులు ప్రయాణిస్తున్న వాహనాన్ని పోలీసులు చుట్టుముట్టి నిలిపివేశారు. దీంతో పోలీసులకు, టిడిపి నేతలకు మధ్య వాగ్వాదం జరిగింది.

దాడిపై టిడిపి నేతల ఖండన

టిడిపి గన్నవరం నియోజకవర్గ కార్యాలయంపై ఎంఎల్‌ఎ వంశీ అనుచరులు దాడి చేయడాన్ని మాజీ మంత్రి, టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర ఖండించారు. టిడిపికి భయపడి వంశీ దాడులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా విజ్ఞులైన ప్రజలు ఈ రాక్షశ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. పిలుపు నిచ్చారు. మీ రాక్షశ ఆలోచనలే తెలుగుదేశానికి విజయ సోపానాలని తెలిపారు. ఈ ఘటనతో వైసీపీ ప్రభుత్వం ఫ్రస్టేషన్ బయటకు వస్తుందన్నారు. పూర్తిగా వైసీపీ ప్రభుత్వం పతన దశకు చేరుకుందన్నారు. ఒక్క క్షణం కూడా జగన్ ఈ రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదన్నారు. ఈ ఘటనకు పాల్పడినవారిపై తక్షణమే చట్టపరమైన చెర్యలు తీసుకోవాలి, లేని పక్షంలో ఈ రాక్షస ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపడయం ఖాయం



అని హెచ్చరించారు. టిడిపి కార్యాలయంపై దాడిని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఖండించారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పైశాచికస్వామ్యంగా మార్చేసిందన్నారు. పోలీసు వ్యవస్థ తీరు చూస్తుంటే వ్యవస్థల పట్ల ప్రజలకు నమ్మకం లేకుండా పోతుందన్నారు. దీనిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలన్నారు. టిడిపి రాష్ట్ర నేత బుద్ధా వెంకన్న కూడా ఈ దాడిని ఖండించారు. ఇది పిరికిపంద చర్య అని అభివర్ణించారు.



గవర్నర్ల వీడ్కోలు, స్వాగత ఏర్పాట్లు

జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇఇ వివి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా సోమవారం గన్నవరం విమానాశ్రయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి గవర్నర్లకు వీడ్కోలు, స్వాగత కార్యక్రమాల ఏర్పాట్లపై చర్చించారు. మంగళవారం ఉదయం 8 గంటలకు రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్‌కు వీడ్కోలు కార్యక్రమం, బుధవారం సాయంత్ర 8.15 గంటలకు నూతన గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు స్వాగత కార్యక్రమం ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు విమానాశ్రయానికి రానున్నారని తెలిపారు. జిల్లా ఎస్పి పి.జాషువా మాట్లాడుతూ ఈ కార్యక్రమాలకు అవసరమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, రాష్ట్ర ప్రోటోకాల్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఏడీ ప్రొటోకాల్ టి.విజయకుమార్, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ ఎన్ఎల్ కె. రెడ్డి, ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్ జాషువా, ఏఎస్పీ సుబ్బారెడ్డి, డిఎస్పి కె.విజయపాల్, జిల్లాలోని ఆర్డీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చాపకింద నీరులా కుష్టు మహమ్మారి...

పిహెచ్‌సి పరిధిలో ముగ్గురికి కుష్టు వ్యాధి వచ్చినట్లు నిర్ధారించారు. వీరిలో ఇద్దరికి వ్యాధి తీవ్రత ఎక్కువుగా ఉండగా మరొకరికి కాస్తా తక్కువ స్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. వీరులపాడు మండలం అల్లూరు పిహెచ్‌సి పరిధిలో ఇద్దరికి, చందర్లపాడు పిహెచ్‌సి పరిధిలో 1, చింతలపాడు పిహెచ్‌సి పరిధిలో 1, జికొండూరు పిహెచ్‌సి పరిధిలో 1, గొల్లమూడి పిహెచ్‌సి పరిధిలో 2, ఇబ్రహీంపట్నం పిహెచ్‌సి పరిధిలో 1, కంచికచర్ల పిహెచ్‌సి పరిధిలో 2, లింగాలపాడు పిహెచ్‌సి పరిధిలో 2, పెనుగంజిప్రోలు పిహెచ్‌సి పరిధిలో 4, రాజుగూడెం పిహెచ్‌సి పరిధిలో 1, రెడ్డిగూడెం పిహెచ్‌సి పరిధిలో 3, విజయవాడ భీమన్నవారి పేట పిహెచ్ పరిధిలో 1, దుర్గాపురం పిహెచ్‌సి పరిధిలో 1, హెచ్‌బి కాలనీ యుపిహెచ్‌సి పరిధిలో 2, కండ్రిక యుపిహెచ్‌సి పరిధిలో 2, కరకట్ట సౌత్ యుపిహెచ్‌సి పరిధిలో 3, ప్రకాష్‌నగర్ యుపిహెచ్‌సి పరిధిలో 1, ముత్యాలంపాడు యుపిహెచ్‌సి పరిధిలో 1, వీరులపాడు పిహెచ్‌సి పరిధిలో 2 కుష్టు కేసులు ఉన్నట్లు నిర్ధారించారు. కుష్టు వ్యాధి నిర్ధారణ అయిన వారికి బహుళ ఔషద చికిత్సా విధానం ద్వారా చికిత్సలు అందించనున్నారు. అంతేకాకుండా వీరి కుటుంబ సభ్యులపై ప్రత్యేక దృష్టి సారించారు. వీరికి ఈ వ్యాధి వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టనున్నారు. అయితే రోగుల్లో అంగవైకల్యం ప్రారంభమైన వారితో పాటు జబ్బు లక్షణాలు తీవ్రత స్థాయిని బట్టి పునర్ నిర్మిత శస్త్ర చికిత్స విధానం(రీ కన్‌స్ట్రక్టివ్ సర్జరీ) ద్వారా రోగులకు చికిత్సలు అందించనున్నారు. రాజమండ్రి పక్కన కత్తిపూడిలోని రూరల్ ఇండియా సెల్ఫ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిపుణుల పర్యవేక్షణలో ఈ చికిత్సలు అందించనున్నారు.

IN THE COURT OF FIRST ADDL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. 1146 of 2020

Between
State Bank of India, RACPC, Gayatrinagar, rep by Chief Manager, Vijayawada
AND
---- PLAINTIFF
1. Chinna Babu Dibba son of late Bhushaiah, D.No. 20-4-132, Near Lotus Land, Basavataraka Nagar, Vijayawada-3.
2. Nakkapalli Atchyuta Ramaiah son of late Bapuji, D.No. 1-27, Namburu 522 508. --- Defendants

Defendants take suit summons in the above suit filed against you by the bank for realization of the suit amount of Rs. 2,50,699/- under the loan account no. 36854510785 and the said suit stands posted to 07-03-2023 for your appearance. Appear before the Hon'ble Court on that day at 10.30 A.M., personally or through an advocate. Else next step follows.

// By Order //
T.V.N.VASUDEVA RAO
Advocate for Plaintiff.

చేరువ వాహనం ద్వారా ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ

కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని రాణిగారితోట లోగల వైట్ బిల్డింగ్ సెంటర్, ఆర్.టి.సి బస్టాండ్ వాడ గల బాలాజీ హెూటల్ ఏరియాలో గల ప్రజలకు సోమవారం పోలీస్ అధికారులు, సిబ్బంది చేరువ వాహనం ద్వారా అవగాహన కల్పించారు. దిశ యాప్ వలన కలిగే ఉపయోగాలు గురించి, సైబర్ నేరాలు ఏవిధంగా జరుగుతున్నాయి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎల్.హెచ్.ఎమ్.యస్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం, మహిళా సంబంధిత నేరాలు, చిన్నపిల్లలకు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ అంటే ఏంటి అనే విషయాలు, నేరాల బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చిన్న చిన్న వీడియోల రూపంలో ఎల్ఇడి స్క్రీన్ పై ప్రదర్శించి అవగాహన కల్పించారు.

CHANGE OF NAME

I, SATYANARAYYANA VELPURI (Old Name), Resident of 107 Flat, Good Life Homes Apartment, Beside Hailand, Chinakakani, V Gard Industrey, Chinakakani, Guntur, Andhrapradesh-522503. My Name has been changed to **VELPURI SATYANARAYANA (New Name)** Hereafter my name is known as **VELPURI SATYANARAYANA.**

గ్రామపంచాయతీ, రామచంద్రాపురం

అవనిగడ్డ మండలం, కృష్ణాజిల్లా

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం. నిల్/2023 **తేది : 20-02-2023**

కృష్ణాజిల్లా, అవనిగడ్డ మండలం, రామచంద్రాపురం గ్రామపంచాయతీలో కాంట్రాక్టు లేబరు పద్ధతిపై ది. 1-4-2023 నుండి 31-3-2024 వరకు పని చేయుటకు ది. 28-02-2023వ తేదీన ఉదయం 11 గం.ల నుండి 1-00 గం.ల వరకు ఈ దిగువ పనులు కాంట్రాక్టు లేబరు పద్ధతిపై రామచంద్రాపురం గ్రామపంచాయతీ కార్యాలయము నందు పంచాయతీ కార్యదర్శి గారిచేగానీ లేదా వారిచే అనుమతి పొందిన వారిచేగానీ సీల్డు టెండర్లు స్వీకరించబడును. అదేరోజు మధ్యాహ్నం 2 గం.లకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో సదరు టెండర్లు తెరువబడును. మిగిలిన వివరములు కార్యాలయం పనిచేయు వేళలయందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పనివివరము	టెండరు కాలపరిమితి	చెల్లించవలసిన ధరావత్తు
1.	రక్షిత మంచినీటి సరఫరా పథకము మోటారు ఆపరేటరు-1	ది.1-4-2023 నుండి ది. 31-3-2024 వరకు	రూ.1000/-

పంచాయతీ కార్యదర్శి నోట్ :
1) గ్రామపంచాయతీ నిధుల నిల్వలను బట్టి వేతము చెల్లించబడును. గతంలో అనుభవము కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సం/- బి.శేషగిరిరావు,
పంచాయతీ కార్యదర్శి,
గ్రామపంచాయతీ, రామచంద్రాపురం
సెల్ : 9989316872

IN THE COURT OF THIRD ADDL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. 2136 of 2021

Between
State Bank of India, Labbipet Branch, rep by Chief Manager, Vijayawada
-**PLAINTIFF**
AND
Venigalla Uma Maheswararao son of Manohar Rao 61-2-136/1, Padavala revu Ventana, Ramalingeswara Nagar Vijayawada-13. --- **Defendant**

Defendant take suit summons in the above suit filed against you by the bank for realization of the suit amount of Rs. 3,79,003/- under the loan account no. 38177679703 and the said suit stands posted to 23-03-2023 for your appearance. Appear before the Hon'ble Court on that day at 10.30 A.M., personally or through an advocate. Else next step follows.

// By Order //
T.V.N.VASUDEVA RAO
Advocate for Plaintiff.

IN THE COURT OF THIRD ADDL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. 329 of 2022

Between
State Bank of India, RACPC, Benz Circle, rep by Chief Manager, Vijayawada
---- PLAINTIFF
AND
Tiramareddy Raju son of Appada Dora, Flat No.3, Tonia Towers, D.No. 77-76-29, Near Nagarjuna School, Payakapuram, Ajitsingh Nagar, Vijayawada-15
--- Defendant

Defendant take suit summons in the above suit filed against you by the bank for realization of the suit amount of Rs. 1,60,492/- under the loan account no. 38939475615 and the said suit stands posted to 17-03-2023 for your appearance. Appear before the Hon'ble Court on that day at 10.30 A.M., personally or through an advocate. Else next step follows.

/1 By Order //
T.V.N.VASUDEVA RAO
Advocate for Plaintiff.

IN THE COURT OF FIRST ADDL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. 242 of 2021

Between
State Bank of India, RACPC, Benzcircle, rep by Chief Manager, Vijayawada
---- PLAINTIFF
AND
1. Nannapaneni Venkata Srinivasarao son of Nageswararao
2. Nannapaneni Lavanya wife of Venkata Srinivasarao 1 and 2 reside in Flat No. 207, Surya Mansion, NTR Colony Gunadala, Vijayawada --- Defendants

Defendants take suit summons in the above suit filed against you by the bank for realization of the suit amount of Rs. 6,70,640/- under the loan account no. 36689723350 and the said suit stands posted to 07-03-2023 for your appearance. Appear before the Hon'ble Court on that day at 10.30 A.M., personally or through an advocate. Else next step follows.

// By Order //
T.V.N.VASUDEVA RAO
Advocate for Plaintiff.

IN THE COURT OF FIRST ADDL JUNIOR CIVIL JUDGE AT VIJAYAWADA
O.S. 989 of 2020

Between
State Bank of India, RACPC, Benz circle, rep by Chief Manager, Vijayawada
PLAINTIFF
AND
Ghantasala Ravi Krishna Kiran son of Murali Mohan Rao, R/o. Plot No. 130 Sai Satya Dev Nagar Colony, Nepalli- 521 245, Kankipadu Mandalam --- Defendants

Defendant take suit summons in the above suit filed against you by the bank for realization of the suit amount of Rs. 1,85,560/- under the loan account no. 32968603604 and the said suit stands posted to 07-03-2023 for your appearance. Appear before the Hon'ble Court on that day at 10.30 A.M., personally or through an advocate. Else next step follows.

// By Order //
T.V.N.VASUDEVA RAO
Advocate for Plaintiff.

అనాథలు, వికలాంగులకు అన్నదానం

ప్రజాశక్తి-గన్నవరం

సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అమరావతి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో వృద్ధులు, అనాథలు, వికలాంగులకు అన్న ప్రసాదం వితరణ బాపులపాడు మండలం హనుమాన్‌జంక్షన్‌లోని నాలుగురోడ్ల జంక్షన్‌లో సోమవారం జరిగింది. ఎంపిడిఒ కె.ప్రభాకరావు చేయూతను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రిని పురస్కరించుకుని తన పితరుల పేరు మీద నిరాశ్రయులకు అన్నదాన వితరణ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రచార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోట సురేష్, మండల కమిటీ కన్వీనర్ కాలి కిరణ్ బాబు, సభ్యులు నూకల శ్రీకాంత్, అటెండర్ తోట రాంబాబు పాల్గొన్నారు.

39 మందికి ఉచిత హోమియో పరీక్షలు

ప్రజాశక్తి-చల్లపల్లి

సోమవారం చల్లపల్లి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ మణికంఠ 39 మందిని పరీక్షించి మందులు అందించారు. కుసుమ, జ్యోతి, ద్రోణ సేవలను అభినందించారు. వాసవి క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సభ్యులు శిబిరాన్ని పర్యవేక్షించారు.

జనసేన సభ్యత్వ నమోదుకు ఆదరణ : ఆర్‌కె

ప్రజాశక్తి-గుడివాడ

గుడివాడ పట్టణంలో పార్టీ క్రియాశీలక మూడో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించినట్లు జనసేన నాయకులు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) తెలిపారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జనసేన పార్టీ



సభ్యత్వాన్ని నమోదు చేయిస్తున్న ఆర్‌కె

ప్రతి కార్యకర్త బాగుండాలని ఆలోచనతో కేవలం రూ.500లకే రూ.5 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ మీరాషరీఫ్, అయ్యప్ప, చరణ్, సురేష్, జగదీష్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు వంశీ పరామర్శ

ప్రజాశక్తి-గన్నవరం

విజయవాడ రూరల్ మండలం ఎనికెపాడు గ్రామంలో మట్టా పీటర్ కుమార్ అనారోగ్యంతో మరణించగా ఆయన కుటుంబ సభ్యులను గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ పరామర్శించారు. ఉంగుటూరు మండలం నారయ్య అప్పారావుపేట గ్రామానికి చెందిన కొల్లి సీతామహాలక్ష్మి మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాపులపాడు మండలం వీరవల్లి గ్రామానికి చెందిన యనమదల రామస్వామి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ వల్లభనేని వంశీ

ఇరు రాష్ట్రాల మంత్రుల దృష్టికి నీటి సమస్య

ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు



ప్రజాశక్తి-విజయవాడ

ఎన్ఎస్‌పి కాల్వల ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీటిని విడుదల చేయడంలో ఎదురవుతున్న సమస్యలను ప్రజా ప్రతినిధుల సహకారంతో ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు తెలిపారు.ఎన్ఎస్‌పి కాల్వల ద్వారా నీటి విడుదల సమస్యపై సోమవారం జిల్లా కలెక్టర్ డిల్లీరావు ఆయన కార్యాలయంలో జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం శాసనసభ్యులు, ఎన్ఎస్‌పి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్ఎస్‌పి కెనాల్ ద్వారా 3,67,220 ఎకరాల ఆయకట్టుకు సాగు నీటిని అందించేలా పులిచింతల ప్రాజెక్టు నుండి ఎన్ఎస్‌పి కాల్వల ద్వారా 32.25 టియంసిల నీటిని కేటాయించడం జరిగిందన్నారు. ఎన్ఎస్‌పి కల్వల ద్వారా తిరువూరు, మైలవరం, నూజివీడు, నందిగామ, గన్నవరం నియోజకవర్గాల పరిధిలో ఆయకట్టుకు ఈ ఏడాది రబీ సీజన్‌కి 19.25 టియంసిలు నీటిని కేటాయించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 9.52 టియంసిలను నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు. ఇంకనూ 9.73 టియంసిల మిగుల నీటిని విడుదల చేయవలసి వుందని కలెక్టర్ డిల్లీరావు అన్నారు.మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణప్రసాద్ మట్లాడుతూ తెలంగాణ అధికారులు సకాలంలో విడుదల చేయవలసిన నీటిని విడుదల చేయకపోవడం వలన రైతాంగం ఇబ్బందులు పడుతున్నారన్నారు. విడుదల చేయవలసిన నీటిని రైతాంగానికి అవసరమైన సమయంలో విడుదల చేయడంలేదన్నారు.జగ్గయ్యపేట శాసన సభ్యులు సామినేని ఉదయభాను మట్లాడుతూ తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం మెట్ట ప్రాంతాల రైతుల ప్రయోజనాలే తమకు ముఖ్యమన్నారు. తెలంగాణ అధికారులు ఎన్ఎస్‌పి కాల్వలకు నీటిని విడుదల చేయడంలో ప్రదర్శిస్తున్న వైఖరిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాల్సిన అవసరం వుందన్నారు. నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్మోహన్‌రావు మాట్లాడుతూ తన నియోజకవర్గం ఎన్ఎస్‌పి కాల్వల కింద చిట్ట చివరిలో ఉందని సాగు నీరు అందక తమ ప్రాంత రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ తిరుమలరావు, ఎన్ఎస్‌పి ఎస్ఇ శ్రీరామకృష్ణ, ఇఇలు ఆర్ అప్పారావు, శ్రీనివాసన్, డిఇలు బి బావిసింగ్, రాంబాబు, శ్రీనివాత్సవ, జెఇలు సుధారాణి, హిమబిందు, రైతు నాయులు గుంటుపల్లి వాసు, చిరుమామిళ్ల అశోక్, అప్పిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం



గుడివాడ : రాష్ట్రంలో తొలిసారిగా విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక స్థానం కల్పించి, వారి సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికి అభినందనలు తెలియజేస్తూ క్షీరాభిషేకం చేశారు. సోమవారం స్థానిక శరత్ థియేటర్ వైసిపి కార్యాలయంలో వైసిపి విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ రాజ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి విభిన్న ప్రతిభావంతులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శరత్, కన్వీనర్ మధుకిరణ్, మురళి, ఫరూక్, భాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

గుడివాడ : రాష్ట్రంలో రైతులకు అన్యాయం చేసిన ఏ ప్రభుత్వం నిలబడలేదని తెలుగు రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లగుళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు విమర్శించారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో జరిగిన స్పందనలో ధాన్యం తోలి రెండు నెలలు అయినా రైతులకు డబ్బులు రావడంలేదని ఫిర్యాదు చేశారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో సదస్సు

గన్నవరం : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం, మహాకవి శ్రీశ్రీ మహాప్రస్థానం' కవితల సంకలనంపై దావాజీగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు కర్ర వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవయిత్రి కోడే యామినీదేవి, ఆర్థిక విశ్లేషకులు గన్నే వెంకటరావు, వి కె ఆర్ కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు మద్దకూరి విజయకుమార్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొంటారని చెప్పారు.

'ఉద్యోగ భద్రత కల్పించాలి'



మాట్లాడుతున్న సమ్మక్క

ప్రజాశక్తి-గన్నవరం

పిల్లలకు ఇచ్చే గుడ్లు ఉడకపెట్టడానికి గ్యాస్ ఖర్చు, జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూ ఛార్జీలకు సంబంధం లేకుండా చెల్లించాలని ఏపి మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల యూనియన్ నాయకురాలు సమ్మక్క కోరారు. సోమవారం గన్నవరంలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విద్యావిధానం వలన చాలామంది వంట ఏజన్సీ కార్మికులు ఉపాధికోల్పోతున్నారని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలకు నిర్వహణ బాధ్యతలను రద్దుచేసి వర్కర్లతోనే పథకాన్ని కొనసాగించాలని డిమాండ్‌చేశారు. కార్మికులకు 10 నెలలకే వేతనాలు ఇస్తున్నారని, 12 నెలలకు చెల్లించాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పథకంలో పని చేస్తున్నవారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎంపీడీవో వెంకటేశ్వరరావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం నాయకులు లలిత కుమారి, కుమారి, సిఐటియు నాయకులు శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ అరుణ కుమారికి సత్కారం

ప్రజాశక్తి-చల్లపల్లి

స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఎ.అరుణకుమారిని ఉద్యోగస్తులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాలు



ఎంపిడిఒ అరుణకుమారిని సత్కరిస్తున్న ఉద్యోగులు

అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ అరుణకుమారి మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరగటానికి తనవంతుగా కృషిచేస్తానన్నారు. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు లబ్దిదారులకు అందేలా చర్యలు తీసుకుంటానన్నారు. అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం తనవంతుగా కృషిచేస్తానని ఆమె హామీఇచ్చారు. ఇఒపిఆర్ అండ్ ఆర్‌డి బూరేపల్లి అశోక్,చల్లపల్లి,లక్ష్మీపురం, పాగోలు, నడకదురు, ఆముదార్లంక, పురిటిగడ్డ, వక్కలగడ్డ, యార్లగడ్డ, వెలువోలు పంచాయతీల కార్యదర్శులు పి.సుకుమార్, ఎ.సాంబశివరావు, పుట్టి రాంబాబు, సుబ్బారావు, హరీష్, బిల్ కలెక్టరు ఎ.నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ సంధ్య,పిఆర్ ఎఇ శ్రీనివాస్ పాల్గొన్నారు .

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి : సముద్రాల

ప్రజాశక్తి-అవనిగడ్డ

మండల పరిధిలోని దక్షిణ చిరువోలులంక ఎస్సీ కాలనీ వాసులకు శ్మశానం ఏర్పాటు చేయాలని జై భీమ్ భారత్ పార్టీ



ఎంపిడిఒతో మాట్లాడుతున్న నాయకులు

తరఫున ఆ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు సముద్రాల అంబేద్కర్ కోరారు. ఈ మేరకు స్పందనలో తహశీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలో ఎస్సీ కాలనీలో 500 కుటుంబాల వారు నివసిస్తున్నారనీ, వారికి శ్మశానం లేనందున ఎవరైనా మరణిస్తే వారిని ఖననం చేసేందుకు అధికారులు చొరవ తీసుకోవాలని అంబేద్కర్ కోరారు. వినతి పత్రంలో ఇచ్చిన వారిలో జై భీమ్ భారత్ పార్టీ సభ్యులు గోరుముచ్చు రవి పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

స్థానిక లయన్స్ సేవా భవనంలో లయన్స్ జోన్ చైర్మన్ పుల్లేటి నాగ విజయబాబు ఆధ్వర్యంలో జోన్ సోషల్ కార్యక్రమంలో భాగంగా క్లబ్ సభ్యులు ఆటల పోటీలు నిర్వహించారు. చల్లపల్లి,ముదినేపల్లి, వడాలి, గుడ్లవల్లేరు క్లబ్ పిఎస్టీలు పాల్గొన్నట్లు జోన్ చైర్మన్ విజయ్ తెలిపారు. గెలుపొందిన వారికి గవర్నర్ శాంతి బహుమతులను అందజేశారు. అనంతరం చైర్మన్ విజయ్‌కు గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ తరఫున అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ, ప్రతినిధులు సన్మానించారు.



విజయ్‌ను సత్కరిస్తున్న క్లబ్ ప్రతినిధులు తదితరులు

పది ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుదాం

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ మోడల్ పరీక్షా పేపర్ల విడుదలలో కలెక్టర్

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధ పరిచి ఫలితాలలో ఈ ఏడాది జిల్లాను అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించనున్న టెన్త్ మోడల్ పరీక్ష ప్రశ్నపత్రాలను సోమవారం కలెక్టరేట్ పింగళివెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రోత్సహించాలన్నారు. సబ్జెక్టు టీచర్లు ఆయా సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థి నైపుణ్యాన్ని తెలుసుకునేలా ముందుస్తు పరీక్షలు నిర్వహించేందుకు మోడల్ పేపర్లను రూపొందించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్, డిఆర్‌వో కె.మోహన్‌కుమార్, డిఇవో సివి రేణుక, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యం సోమేశ్వరరావు, మహిళ కన్వీనర్ సిహెచ్ ప్రణీత, నగర కమిటీ సభ్యులు పి.బాలు, ఆదర్శ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పరీక్ష విజయవంతం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి మోడల్ పరీక్ష విజయవంతమైనట్లు ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమేశ్వరరావు తెలిపారు. మోడల్ పరీక్ష ప్రశ్నాపత్రాన్ని కొండపల్లి హైస్కూల్లో వెనిగళ్ల మురళీమోహన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం కొండపల్లి బాలికల హైస్కూల్, క్రాంతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పరీక్షలో పాల్గొన్నారని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. సుమారు ఏడు వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు లీలా ప్రసన్న, క్రాంతి హైస్కూల్ శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు కార్తీక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తిరువూరు: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.నాగకుమారి, యుటిఎఫ్ నాయకులు భరతకుమారి పరీక్షా పత్రాన్ని విడుదల చేశారు. మండలం వ్యాప్తంగా 500 మంది పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరావు, మాజీ నాయకులు వెంకటేశ్వరరావు, మండల నాయకులు నాగేంద్ర, వెంకటలక్ష్మి, ఖదీర్, లక్ష్మీ ప్రసన్న, మోహన్‌కృష్ణ, రఫీ, జాన్ పాల్గొన్నారు.



మోడల్ పరీక్ష ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్ డిల్లీరావు



కాళహస్తీశ్వరస్వామికి దుర్గగుడి పట్టు వస్త్రాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక దేవి సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి వార్లకు శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి తరుపున పట్టు వస్త్రాలను సమర్పించుటకు సోమవారం ఆలయ పాలకమండలి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, పాలకమండలి సభ్యులు మరియు అర్చక బందం శ్రీకాళహస్తి దేవస్థానం చేరుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ కాళహస్తీశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి సాగర్ బాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ అమ్మవారు స్వామివార్లను దర్శనం చేసుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కట్టా సత్తయ్య, నంబూరి రవి, చింతా సింహాచలం, కోలుకులూరి రామసీత, దేవిశెట్టి బాలకష్ణ, ఆలయ వైదిక సిబ్బంది ఆర్.శ్రీనివాస శాస్త్రి, కార్యనిర్వాహక ఇంజినీర్ లింగం రమాదేవి పాల్గొన్నారు.

మేయర్, కమిషనర్‌కు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ స్పోర్ట్స్, కల్చరల్ మీట్ ఏర్పాటు చేసి విజయవంతం చేసినందుకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు ఎపి మునిసిపల్ కార్పొరేషన్స్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బి.శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... స్పోర్ట్స్ మీట్‌లు ఉద్యోగుల్లో ఉన్న క్రీడా, కళాత్మకమైన నైపుణ్యతలను వెలికితీయడానికి ఎంతో దోహదపడతాయన్నారు.

మాతృభాషా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ: మొగల్‌రాజపురంలోని జన శిక్షణ సంస్థాన్‌లో మాతృభాషా దినోత్సవ వేడుకలు సోమవారం జరిగాయి. ఈకార్యక్రమం జన శిక్షణ సంస్థాన్ చైర్‌ఫర్సన్ డాక్టర్ యన్. విద్యాకన్నా ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, బాలోత్సవ్ కమిటీ అధ్యక్షులు యస్.పి.రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ మాతృభాషను ప్రతిఒక్కరూ నేర్చుకోవాలన్నారు. ఇతర భాషలు ఎన్ని నేర్చుకున్నా తల్లి భాషను ఖచ్చితంగా నేర్చుకోవడంతో పాటు భాషను మాట్లాడాలన్నారు. దేశంలోని ప్రతిఒక్కరికీ మాతృభాష ఎంతో అవసరమని, దానితోనే వారి సంస్కృతి సంప్రదాయలు ముడిపడి ఉంటాయన్నారు. ప్రపంచంలో అనేక ప్రాంతాలలో నివసిస్తున్న మన తెలుగు వారు మాతృభాషగా తెలుగును అభ్యసించకపోవడం, మాతృభాషగా తెలుగును చెప్పుకోకపోవం దురదృష్టకరమన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు గోళ్ల నారాయణరావు, రోటరీ క్లబ్ కార్యదర్శి బి. చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.





దర్భేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి-భవానీపురం

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి కొత్తపేట సైకం వారి వీధిలో ఉన్న శ్రీ దర్భేశ్వరస్వామి దేవస్థానంలో పవళింపు సేవ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్త రాంపిళ్ల జయప్రకాష్ కుటుంబీకులు, ప్రముఖ వ్యాపారవేత్త తమ్మిన మారుతి, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్ తమ్మిన సోనియా దంపతులు తదితరులు పాల్గొన్నారు.

హిందూ హైస్కూల్ విద్యార్థులకు పతకాలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో వన్‌టౌన్ కొత్తపేటకు చెందిన ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్ విద్యార్థులు అనేక పతకాలు సాధించి జాతీయ పోటీలకు కూడా అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల కమిటీ కార్యదర్శి కె.ఎల్.వి మోహనరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు వ్యక్తిగత క్రీడాంశాలలో పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. బాక్సింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరచి పాఠశాలకే గాకుండా జిల్లాకు కూడా పేరు ప్రఖ్యాతలు తీసుకురావడం అభినందనీయమన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా సమానంగా ప్రాధాన్యం కల్పిస్తున్నామని దానికి ఈ ఫలితాలే నిదర్శనం అని కొనియాడారు. అనంతరం పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సాధించిన ప్రగతి పట్ల ఎస్‌కెపివివి హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షుడు చిట్టూరి ఆనంద్ రామ సుధాకర్, జనరల్ సెక్రెటరీ కరెస్పాండెంట్ గోపిసెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ళ బాబా విజయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.వి.సత్యప్రసాద్, ఎస్. లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.





స్పందనకు తొమ్మిది అర్జీలు

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజల నుంచి స్వీకరిస్తున్న అర్జీలను సత్వరమే పరిష్కరించడానికి ఆయా విభాగాల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. విఎంసిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వస్తున్న అర్జీదారులు వారి పరిధిలోని సర్కిల్స్ కార్యాలయాల్లో అర్జీలను ఇవ్వాలని కోరారు. సర్కిల్స్ కార్యాలయాల్లో సత్వరమే పరిష్కరిస్తారని, అక్కడ పరిష్కారం కాని అర్జీలను విఎంసిలో స్వీకరించడం జరుగుతుందని అన్నారు. స్పందన కార్యక్రమానికి మొత్తం తొమ్మిది అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎటువంటి అర్జీలూ నమోదు కాలేదు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే...

ప్రజాశక్తి-భవానీపురం: కబేళ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11 కె.వి. సితార విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు కబేళా సెంటర్, రోటరీ నగర్, బ్రహ్మయ్య కాలనీ, మిల్క్ కాలనీ, మిథిలా నగర్, సితార సెంటర్ తదితర ప్రదేశాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.వి. సుధాకర్ తెలిపారు. అలాగే టీచర్స్ కాలనీ, అప్నా బజార్ రోడ్, ఇందిరా ప్రియదర్శిని కాలనీ, దర్గా ప్లాట్స్, 450 ఎస్ఎఫ్‌టి బ్లాకుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ధర్నాలో ఎన్.సిహెచ్.శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయవాడ: జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల (క్లాప్ మిత్ర) న్యాయమైన సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎపి గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ హెచ్చరించారు. గ్రామపంచాయితీల్లో పనిచేస్తున్న కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లకు కనీస వేతనం రూ.21 వేలు, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయితీ కార్మికులకు పనిభద్రత కల్పించాలని కోరారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జి.కొండూరు మండలం కవులూరులో నలుగురికి నాలుగు సంవత్సరాలుగా వేతనాలు చెల్లించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించకపోవటం, అతి తక్కువ వేతనాలు ఇస్తుండటంతో కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిఒ 132, 680 ప్రకారం అందరికీ పిఎఫ్, ఇఎస్ఐ, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని, యూనిఫామ్, సబ్బులు, చెప్పులు, కొబ్బరినూనె వంటివి ఇవ్వాలని కోరారు. సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొత్తగా తీసుకొచ్చిన హాజరు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు సిహెచ్.లక్ష్మీనారాయణ, దుర్గ, ప్రశాంతి, సతీష్, భారతి, శ్రీను, కోటేశ్వరరావు, పి.చిన్నమ్మాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పంచాయితీ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రాలను అందజేశారు.



ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్లు